క్లుప్తంగా

అత్యవసర వైద్యసేవలపై అప్రమత్తంగా ఉండాలి



దేవరుప్పుల: నిత్యం అత్యవసర వైద్యసేవలపై 108 సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని అంబులెన్స్ వెహికల్ ఆడిట్ అధికారి ఫయాజ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌లోని వైద్య పరికరాలు, వినియోగిస్తున్న తీరుపై ఆయన తోపాటు డిపో ఎస్‌కే సలీమ్, ఎమర్జెన్సీ ఎగ్జిక్యూటివ్ రాము కలిసి తనిఖీ చేశారు. ఈఎంటీ కళ్యాణి, పైలట్ రవితేజను రికార్డులు పరిశీలించి మెరుగైన వైద్య చికిత్సలు అందించడంపై అభినందనలు తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత



చిల్పూరు: పల్లగుట్ట గ్రామానికి చెందిన జీడి ఏలియా మేనకోడలు దార కృపకు హార్ట్ సర్జరీ చేయాల్సి ఉండడంతో చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. కాగా, గురువారం కడియం స్పందించి రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబానికి అందజేశారు. చిర్ర నాగరాజు, దార రాజు, డాక్టర్ పేరాల సుధాకర్, నరసింహారెడ్డి, పిట్టల ఎల్లయ్య, జీడి ఆనందం, గుర్రపు యాదగిరి, కుంచాల సంపత్‌రాజు, దార అశోక్‌పాల్, ఇసురం కృష్ణ, జైరాజ్ ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఏర్పాటు

జనగామ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం, పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వదేశీ దీపావళి కోసం పర్యావరణ అనుకూల ఉత్పత్తుల అమ్మకాన్ని తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ సంయుక్తంగా నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలలు, కళాశాల విద్యార్థులు ఇతర భాగస్వాములు ఈనెల 18వ తేదీన ఉదయం 11.00 గంటలకు ఎగ్జిబిషన్‌ను సందర్శించునున్నట్లు ఆయన తెలిపారు.

గుడిసెవాసులకు సౌకర్యాలు కల్పించాలి



బచ్చన్నపేట: మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలోని మల్లు స్వరాజ్యం నగర్‌కాలనీలో కనీస సౌకర్యాలను కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం గుడిసెవాసులతో కలిసి కాలనీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్ ఎదుట ధర్నా చేపట్టి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రామానుజాచారికి అందజేశారు. పర్వతం నర్సింహులు, పొన్నాల రాజవ్వ, తాడూరి వెంకటమ్మ, సులోచన, కిష్టయ్య, చెంద్రం పాల్గొన్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- గ్రామాల్లో ఊసేలేని చెత్త రీసైక్లింగ్
- నిధుల కొరత పేరుతో చెత్త సేకరణకు బ్రేక్
- గొర్రెలు, గేదెలకు నిలయాలుగా మారిన పరిస్థితి

చిల్పూరు: పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ప్రతీ గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్‌ల నిర్మాణాలు చేపట్టింది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అధికారులు తూతూ మంత్రంగా ఇంటింటికి చెత్త సేకరణ చేయిస్తున్నప్పటికీ అది సెగ్రిగేషన్ షెడ్ల వరకు చేరడంలేదు. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది.

నీరుగారిన ప్రభుత్వ లక్ష్యం..

గత ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్‌ల నిర్మాణం కోసం జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా జీపీకి రూ. 2.5 లక్షల నిధులను కేటాయించింది. ఆ నిధులతో షెడ్ నిర్మాణం, తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు తొట్టిల నిర్మాణం, పనిచేసే వారికోసం ప్రత్యేకంగా మరుగుదొడ్డి లాంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రతీ ఇంటి నుంచి సేకరించిన చెత్తను ఇక్కడికి తెచ్చి తడి పొడిచెత్తను వేరు చేసి వానపాముల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసేవారు. ఇలా తయారైన ఎరువులను రైతులకు తక్కువ ధరతో విక్రయించేందుకు జీపీ కార్యదర్శులకు అనుమతులు ఇవ్వడంతో గ్రామాల్లో కంపోస్టు ఎరువులను విక్రయించి పంచాయతీకి నిధులు జమచేశారు.

పశువులకు నిలయంగా షెడ్లు..

చాలా గ్రామాల్లో చెత్త సేకరణ చేసి షెడ్లకు తీసుకెళ్లకపోవడంతో అవి గొర్రెలు, గేదెలకు నిలయంగా మారాయి. పలు గ్రామాల్లో నిధుల కొరత పేరుతో జీపీ ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరించడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఎప్పటిలాగే ఇంటింటికి చెత్త సేకరణ చేయించి సెంద్రియ ఎరువులను తయారు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చిల్పూరులో పశువుల కొట్టంగా మారిని సెగ్రిగేషన్ షెడ్డు



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

వారంలో రెండు రోజులే చెత్త సేకరణ



గతంలో ప్రతీ రోజు జీపీ ట్రాక్టర్ ద్వారా ఇళ్లలో నుంచి చెత్త సేకరించే వారు. తడి, పొడిచెత్త వేరు చేసేందుకు ప్లాస్టిక్ డాబ్బాలను కూడా అందజేశారు. ప్రస్తుతం వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే చెత్తను సేకరిస్తున్నారు.

– వెలిశాల శ్రీనివాస్, స్థానికుడు

చెత్తను షెడ్లకు తరలిస్తాం..



ట్రాక్టర్ల రిపేరు కారణంగా కొన్ని గ్రామాల్లో చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. సేకరించిన చెత్తను షెగ్రిగేషన్ షెడ్లుకు తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. కొన్ని గ్రామాల్లో ఎరువుల తయారీకి చెత్తను సిద్ధం చేశాం.

– శంకర్‌నాయక్, ఎంపీడీఓ

జమ్మూకశ్మీర్‌లో బతుకమ్మ ఆడడం గొప్ప విషయం



పరపతి సంఘం సభ్యులతో కవిత

జనగామ: సమస్యాత్మక ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో బతుకమ్మ ఆడడం గొప్ప విషయమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఇటీవల జిల్లా కేంద్రానికి చెందిన బాలాజీ పరపతి సంఘం సభ్యులు జమ్మూకశ్మీర్ విహార యాత్రకు వెళ్లి పహల్గాంలో అక్కడ దొరికిన పూలతో బతుకమ్మ ఆడిపాడారు. విషయం తెలుసుకున్న కల్వకుంట్ల కవిత సదరు మహిళలను జాగృతి కార్యాలయంలో శాలువాలతో గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం వారితో కలసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో బుర్ర లలిత, శివగారి,రజిని, మరియాల మంజుల,పాశికంటి సుజాత,బోంపల్లి సుజాత, పద్మ, రుక్మిణి, జయశ్రీ, ఉమాదేవి, సరిత, ఉపేంద్ర, గీతాంజలి, మంజుల, శైలజ, శ్రీదేవి, లక్ష్మి, వనజ, మమత, శీలక్ష్మి, విజయలక్ష్మి, కవిత పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో పోషకాహారం ముఖ్యం

కొడకండ్ల: ఆరోగ్య సంరక్షణ కోసం పోషకాహారం తీసుకోవడం ముఖ్యమని డాక్టర్ భారతి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని రైతు వేదికలో సీడీపీఓ సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన పోషణ మాసం ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మాతా శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనిచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. డీటీ పద్మజ, ఎపీఎం నర్సయ్యగౌడ్, సూపరువైజరులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతీ ఒక్కరూ ఉన్నంతలో సరైన పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని స్టేషన్‌ఘన్‌పూర్ 6వ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ మునిగాల రాణి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా స్థానిక 6వ అంగన్‌వాడీ సెంటర్‌లో మునిగాల రాణి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్‌వాడీలు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ భారతి

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

దేవరుప్పుల: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని లయన్స్ క్లబ్ దేవరుప్పుల అధ్యక్షుడు గోలి చిన్న ఉప్పల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గోలి చిన్న ఉప్పల్‌రెడ్డి కూతుర్లు సంకీర్తన-కార్తీక్ రెడ్డి సింధు-సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.30 వేల వ్యయంతో బూట్లు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రాథమిక విద్య బలోపేతంతోనే ఉన్నత విద్యలో రాణిస్తూ ఆశించిన రంగాల్లో పురోగతి సాధిస్తారన్నారు. హెచ్‌ఎం స్వప్న, క్లబ్ ప్రతినిధులు మర్రి పట్టాభిరామిరెడ్డి, బూత్కూర్ అశోక్ రెడ్డి, ఈదునూరి నర్సింహ్మారెడ్డి, రామచంద్రారెడ్డి, గడ్డం సత్యనారాయణరెడ్డి, , ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వెంకటేశ్, శారద పాల్గొన్నారు.



విద్యార్థులతో దాతలు

కలెక్టరేట్ ఏఓకు వినతి

జనగామ రూరల్: జిల్లాలోని గిరిజన సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి లేని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి ప్రేమకళను సస్పెండ్ చేయాలని తెలంగాణ గిరిజన సంఘం పూర్వ జిల్లా కార్యదర్శి చందు నాయక్ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు.

బకాయిలు విడుదల చేయాలి

జనగామ రూరల్: బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్ కోరారు. గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి అజ్మీర సురేష్ నాయక్, పొదల లవ కుమార్, మామిడాల రమేష్ తదితరులు పాల్గొన్నారు

బీరు సీసాతో బెదిరించి రూ.22 వేల చోరీ



బాలికను విచారిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

జనగామ రూరల్: ఇద్దరు దుండగులు ముసుగు ధరించి వచ్చి ఓ ఇంట్లో నగదు చోరీకి పాల్పడిన సంఘటన మండలంలోని చౌడారం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వి. నరసింహ కుటుంబ సభ్యులతో బంధువుల శుభకార్యానికి వెళ్లగా, ఇంట్లో కుమార్తె ఒంటరిగా ఉంది. ఈ క్రమంలో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు నలుపు దుస్తులు ధరించి, ముఖానికి మాస్కులతో ఇంట్లోకి చొరబడ్డారు. బాలికను బీరు సీసాతో చంపుతామని బెదిరించి బీరువాలో ఉన్న రూ.22 వేల నగదును ఎత్తుకెళ్లారు. తర్వాత అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలిసిన వెంటనే ఎస్సై భరత్‌తో కలిసి సీఐ సత్యనారాయణరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామంలో ఈ ఘటన కలకలం రేపగా, పో లీసులు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

- మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్

జనగామ రూరల్: రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం ఉంటుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. గురువారం మండలంలోని వెంకిర్యాల, గానుగుపహాడ్, ఎర్రగొల్ల పహాడ్, ఎర్రకుంటతండా, వడ్లకొండ, పెద్ద పహాడ్ గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. దళారులనునమ్మి మోసపోవద్దన్నారు. జనగామ చిటకోడూర్ పీఏసీఎస్ చైర్మన్లు నిమ్మతి మహేందర్ రెడ్డి, చిర్ర శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

బచ్చన్నపేట: రైతులు పండించిన ధాన్యాన్ని దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ బండకింది హరిబాబుగౌడ్, దేవస్థాన చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జనగామ రూరల్: ఎర్రకుంట తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివరాజ్



బచ్చన్నపేట: నాగిరెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్వేత

గో ఉత్పత్తులతో ఉపయోగాలు

జనగామ: మన పూర్వీకులు గోవులను కుటుంబ సభ్యుల్లో భాగంగా చూసుకునేవారని, గో ఉత్పత్తులతో అనేక ఉపయోగాలు ఉన్నాయని వివేకానంద సేవా సమితి జిల్లా కార్యదర్శి దొంతుల శేఖర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో గో సేవ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు విజ్ఞాన పరీక్షలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ప్రాంత స్థాయి పరీక్షలో భారీ సంఖ్యలో పాల్గొన్నారు. దొంతుల శేఖర్ మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా పూర్వకాలం నుంచి మన పరంపరలో గోవును పూజించేవారని అన్నారు. శాస్త్రీయంగా మానవాళికి గోవు ద్వారా గో ఉత్పత్తుల ద్వారా అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. గో సేవ జిల్లా ప్రముఖ్ దమ్మన్నగారి మాధవరెడ్డి, ఫకీరు యాదగిరిరెడ్డి, తాండ్ర వీరారెడ్డి, వంగ రవి, పాఠశాల ప్రిన్సిపల్ పాషా, ఇట్టబోయిన రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శేఖర్

మద్యం పాలసీతో ప్రయోజనం లేదు

కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి వెంకట మల్లయ్య

రఘునాథపల్లి: ప్రభుత్వం ఇటీవల గౌడ కులస్తుల కోసం 15 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెచ్చిన మద్యం పాలసీ వలన గీత కార్మికులకు ప్రయోజనం ఏమీలేదని కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి బాల్నె వెంకట మల్లయ్య, జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్యలు అన్నారు. మండల కేంద్రంలోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో గురువారం కల్లగీత కార్మిక సంఘం మండల 4వ మహాసభ మండల అధ్యక్షుడు బుర్ర లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుంటే మంత్రుల ఇళ్లు ముట్టడించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్షుడు కుర్ర రాజు, ప్రధాన కార్యదర్శి నామాల యాదగిరి, గౌరవ అధ్యక్షుడు బాల్నె రాజయ్య సభ్యులుగా గైని శ్రీనివాస్, బాల్నె భిక్షపతి, శ్రీకాంత్, కుమార్, మల్లేష్, యాకన్న, భాస్కర్, రాజు, వెంకన్న, వేములయ్య, అంజయ్య, రాములు, నరసయ్య, వేణు బాబు ఎన్నికయ్యారు.



కమిటీ సభ్యులతో వెంకటమల్లయ్య

పరశురామ్‌కు అబ్దుల్ కలాం అవార్డు



జనగామ రూరల్: హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్‌కు అబ్దుల్ కలాం జాతీయ అవార్డు అందజేశారు. పరశురాం చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి రిటైర్డ్ జడ్జి ఎస్. మాల్యాద్రి, అడిషనల్ డీసీపీ రాందాస్ తేజావత్, హైకోర్టు న్యాయవాది నాగుల శ్రీనివాస్, పూలే ఫౌండేషన్ చైర్మన్ పరమేశ్వరి మీనగ గోపి బోయ అవార్డును ప్రదానం చేశారు.

పశువులకు టీకాలు వేయించాలి



చిల్పూరు: పాడి రైతులు పశువులకు టీకాలు వేయించి పశుసంపదను కాపాడాలని జిల్లా మానిటరింగ్ అధికారి డాక్టర్ సారంగపాణి అన్నారు. మల్కాపూర్ పశువైద్యశాలను గురువారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మండల పశువైద్యాధికారి మూడిక అనేష్‌తో కలిసి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి పశువులకు టీకాలు వేశారు. సిబ్బంది సుధాకర్, ఫయాజ్, నాగరాజు, సదానందం రైతులు ఉన్నారు.

అభినందనీయం



దేవరుప్పుల: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పూర్వవైభవం తెచ్చేందుకు చేపట్టిన పురోగతి సేవలు అభినందనీయమని హెచ్‌ఎం మాధవి అన్నారు. గురువారం సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించి ఇటీవల బదీలపై వెళ్లిన హెచ్‌ఎం అంబటి అంజయ్య, ఉపాధ్యాయురాలు చైతన్యలను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. వీడ్కోలు పలికిన విద్యార్థులకు గురువుల గుర్తుగా రాగిజావ తాగేందుకు గ్లాసులు బహూకరించారు.

మాదకద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి



చిల్పూరు: మాదకద్రవ్యాపాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని జ్యోతి నికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురువారం మాదకద్రవ్యాల నివారణలో భాగంగా పాఠశాల విద్యార్థులకు కరస్పాండెంట్ మేరీ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, కష్టాలను వివరించారు. అనంతరం ఎస్సైని విద్యార్థులు సన్మానించారు.

హర్షణీయం

చిల్పూరు: ప్రభుత్వం ప్రాథమిక విద్య ప్రత్యేకతను గుర్తించి పాఠశాలల హెచ్‌ఎంలకు పర్యవేక్షణాధికారాలను కల్పించడం హర్షణీయమని చిల్పూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కన్నయ్య అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యను గుర్తించి జీఓ 90 ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

పాలకుర్తి: మండలంలోని గూడూరు గ్రామంలో ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో గురువారం వాసవీ కన్యకాపరమేశ్వరికి దూపదీప నైవేద్యాలు, ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గణపతి సరస్వతి ఆలయంలో అమ్మవారికి బ్రహ్మాచారి ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. పట్వారి శ్రీనివాస్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొడకండ్ల: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టుకున్న ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల మేరకు.. దేవరుప్పులకు చెందిన ఎస్‌కే హైదర్, స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన ఎస్‌కే హుస్సేన్, రంగరాయగూడేనికి చెందిన ఎస్‌కే దిలీప్‌లు దేవరుప్పుల వాగు నుంచి కొడకండ్లకు ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. గురువారం మండల కేంద్రంలో పోలీసులు తనిఖీల్లో భాగంగా ట్రాక్టర్లను పట్టుకున్నారు. వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లభ్యం కాలేదు. ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు ఓనర్లు ఎస్‌కే సుభాన్, ఎస్‌కే హైదర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఉద్యమాలతోనే రిజర్వేషన్లు సాధ్యం

దేవరుప్పుల: జనాభా దామాషా ప్రకారం సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల కోసం బీసీల ఐక్య సంఘటన ఉద్యమాలతోనే రిజర్వేషన్లు సాధ్యమని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం సదానందం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18న తలపెట్టిన బీసీ సంఘాల తెలంగాణ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల ఈజీఎస్ వివరాల 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను ఈనెల 18న నిర్వహించనున్నట్లు ఏపీఓ కృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో డీఆర్‌పీలు సర్వేలు చేసి ఆయా గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారని తెలిపారు. గ్రామాల్లో జరిగిన పనుల వివరాలను వెల్లడించడం జరుగుతుందని, ఏవైనా అవకతవకలు ఉంటే అధికారులకు తెలియజేయాలని అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించే ప్రజా వేదికకు ప్రజలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ సీలింగ్ భూమిని కాపాడాలి

జనగామ రూరల్: ఎర్రగోళ్లపాడు గ్రామంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమాలకు పాల్పడి అమ్ముకుంటున్న ప్రభుత్వ సీలింగ్ భూములను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కాపాడి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపేందర్, బోడ నరేందర్, గుండెల్లి రాజు బైరగోని మల్లేశం సురేష్ నాయక్ పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: పత్తి రైతుల ప్రయోజనాల కోసం వెంటనే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో గురువారం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు పిట్టల శ్రీను, మంద మొగిలి, మల్లయ్య, నాగరాజు, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతు సంఘం నాయకులు, రైతులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ రాజేష్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు రాయపురం భిక్షపతి, నాయకులు అన్నెపు ప్రభాకర్, వడ్లకొండ రాజు పాల్గొన్నారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు



గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న 108 సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు తాటికొండ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గోవిందు ప్రదీప్ బైక్‌పై ఘన్‌పూర్ నుంచి కొత్తపల్లి వైపునకు వెళ్తుండగా జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(ఐ)కి చెందిన నూనగంటి రవి, రడపాక వెంకటస్వామి మరో బైక్‌పై ఎదురుగా వస్తున్న క్రమంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో ప్రదీప్ కాలు విరగగా, రవి తలకు, చేతులకు, వెంకటస్వామికి కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వారికి ఫోన్‌లో సమాచారం అందించగా వెంటనే స్పందించి ఈఎంటీ హరికృష్ణ, పైలట్ రవికుమార్ క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి పూర్తిస్థాయిలో చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ విషయమై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

రైలునుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు



బాధితుడిని స్ట్రెచర్‌పై తీసుకొస్తున్న 108 సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్లే దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు పడి మహారాష్ట్రకు చెందిన వాకూర్‌కర్ అవినాష్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వే ఫ్లై ఓవర్ నుంచి దాదాపు 2 కిలోమీటర్ల దూరంలో దక్షిణ్‌ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి అవినాష్ ప్రమాదవశాత్తు రైల్వేట్రాక్‌పై పడ్డాడు. కాగా రైల్వేస్టేషన్ మాస్టర్ అందించిన సమాచారం మేరకు 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే స్పందించారు. స్థానిక రైల్వేగేటు వద్దకు చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ రాజేందర్, పైలట్ రాజన్న చీకట్లో రైల్వే ట్రాక్‌పై రెండు కిలోమీటర్లుకాలినడకన వెళ్లి క్షతగాత్రుడిని స్ట్రెచర్‌పై అంబులెన్స్ వరకు తీసుకువచ్చారు. వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో బాధితుడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, రైల్వేట్రాక్‌పై రెండు కిలోమీటర్ల కాలినడకన వెళ్లి బాధితుడిని స్ట్రెచర్‌పై తీసుకువచ్చిన సిబ్బందిని పలువురు అభినందిస్తున్నారు.

జనగాం బ్రాయిలర్ చికెన్ రేట్లు

హోల్‌సేల్ రేటు	- 119/-
రిటైల్ లైవ్	- 142/-
విత్ స్కిన్	- 210/-
స్కిన్ లెస్	- 232/-